ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
సోమవారం 3 నవంబరు 2025



బియ్యానికే పరిమితమైన కొత్త రేషన్ కార్డులు

- వర్తించని సంక్షేమ పథకాలు
- కొత్త దరఖాస్తులకు ఆన్‌లైన్‌లో నోఆప్షన్
- పథకాలు వర్తింపజేయాలంటున్న లబ్ధిదారులు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా జారీ చేస్తున్న రేషన్ కార్డుల వినియోగ దారులకు ఇతర పథకాలు వర్తించ పోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఆ కార్డులపై కేవలం రేషన్ బియ్యం మినహా మరే ఇతర పథకాలు అందడం లేదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని ప్రక టించింది. ఆ మేరకు మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 5 లక్షల నుంచి 10 లక్షల రూపాయల వరకు ఉచిత వైద్య సౌకర్యం, రెండు లక్షల వరకు రైతులకు రుణమాఫీ, రైతు భరోసా పథకం కింద ఎకరానికి 6 వేల రూపాయల చొప్పున పెట్టుబడి సాయాన్ని, కూలీ లకు ఆర్థిక సహాయం అంది స్తున్నది. అలాగే గృహ లక్ష్మి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 500 రూపాయలకే సబ్సిడీ గ్యాస్, ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఇళ్ల మంజూరు, కొత్త రేషన్ కార్డులను అందజేస్తున్నది. గత ప్రభుత్వ హయాంలో రేషన్ కార్డుల కోసం అనేక మంది దరఖాస్తు చేసుకు న్నప్పటికీ కార్డులు మంజూరు చేయలేదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఏడాది నుంచి అర్హులైన వారికి రేషన్ కార్డులను అందజే స్తున్నది. వాటిపై ఆగస్టు నుంచి ఉచితంగా సన్న రేషన్ బియ్యం సరఫరా చేస్తున్నది. అయితే ఈ కార్డులు పొందిన వారికి గృహలక్ష్మి ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, వంట గ్యాస్ సబ్సిడీ పథకాలు వర్తింప జేయడం లేదు. ప్రభుత్వం రేషన్ కార్డులు ఇచ్చినప్పటికీ, ఆయా పథకాలు వర్తింప జేయకపోవడంతో నిరాశ, నిస్పృహలకు గురవుతు న్నా రు.ఆయా పథకాల కోసం దరఖాస్తు చేసుకునేం దు కు ఆయా కార్యాలయాలకు వెళు తున్నప్పటికీ ప్రజా పాలన సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేం దుకుప్రభుత్వంఆప్షన్ ఇవ్వడం లేదని వాపోతున్నారు.

● కొనసాగుతున్న కార్డుల జారీ ప్రక్రియ

జిల్లాలో 413 రేషన్ షాపులు ఉండగా, వీటి పరిధిలో 2,35,721 రేషన్ కార్డులున్నాయి. 7,29,534 మంది ఆ కార్డుల ద్వారా రేషన్ బియ్యం పొందు తున్నారు. జిల్లా వ్యాప్తంగా 14 వేలకు పైగా కొత్త కార్డులను జారీ చేశారు. రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగిస్తామని ప్రభుత్వం ప్రక టించింది. మీసేవా కేంద్రాల ద్వారా కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి, వారి ఆర్థిక స్థితిగతులపై రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి అర్హులను గుర్తించి కార్డులు జారీ చేస్తున్నారు. ఆహార భద్రత కార్డు పొందిన వెంటనే కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరి పేరిట 6 కిలోల చొప్పున ఉచిత బియ్యం అందిస్తున్నారు.

● ప్రజాపాలనలో కార్డులు లేక అందని పథకాలు..

ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2023 డిసెంబరు 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు గ్రామాల్లో గ్రామసభలు, పట్టణాల్లో వార్డు సభలను నిర్వహించి ఆరు గ్యారంటీ పథకాల్లో భాగంగా 5 పథకాల కోసం ఒకే నమూనా దరఖాస్తులను స్వీకరించింది. రేషన్ కార్డులు లేని వారి నుంచి కూడా దరఖాస్తులను తీసుకున్నారు. ఈ దరఖాస్తులను అన్నింటినీ ప్రజాపాలన వెబ్‌సైట్‌లో నమోదు చేశారు. అప్పటికీ రేషన్ కార్డులు కలిగి ఉన్న వారికే ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తించాయి. ప్రజాపాలన దరఖాస్తులు నిరంతర ప్రక్రియ అని అధికారులు చెప్పినప్పటికీ, పాత దరఖాస్తుల్లో తప్పుల సవరణకు మాత్రమే అవకాశం కల్పించారు. కొత్తగా అర్జీలు స్వీకరించడం లేదు. మీసేవాలో దరఖాస్తు చేసుకోవాలనుకున్నా కొత్త వారి కోసం ఆన్‌లైన్‌లో నమోదుకు వెబ్‌ఆప్షన్ కూడా అందుబాటులో లేదు.

దీంతో కొత్త కార్డుదారులందరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందలేకపోతున్నారు. తమకు ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు జారీ చేసి నప్పటికీ ఇతర పథకాలు వర్తించడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాలకు వెళితే ఆప్షన్ రాలేదని అంటు న్నారని తెలిపారు. సంక్షేమ పథకాలకు అర్హులైనప్పటికీ గృహలక్ష్మి, రూ.500కే సబ్సిడీ గ్యాస్ పొందలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆయా సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందేందుకు అవకాశం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

యువతకు అండగా సింగరేణి

- కోల్‌బెల్ట్ ప్రాంతంలో జాబ్‌మేళాలు
- ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 7 చోట్ల నిర్వహణ
- హాజరైన 66,965 మంది నిరుద్యోగులు
- 23,650 మందికి ఉద్యోగాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న నిరుద్యోగులు


జాబ్ మేళాలో ఉద్యోగం సాధించిన వారికి అపాయింట్‌మెంట్ ఆర్డర్ అందజేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క (ఫైల్)

గోదావరిఖని, నవంబరు 2(ఆంధ్ర జ్యోతి): నిరుద్యోగుల కోసం సింగరేణి జాబ్ మేళాలు నిర్వహిస్తోంది. తగిన విద్యార్హతలు ఉన్నా, హైదరాబాద్ నగరంలో కంపెనీల చు ట్టూ తిరిగినా ఉద్యోగం లభిస్తుందనే గ్యారంటీ లేదు. ఈ పరిస్థితుల్లో పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల యువత ముంగిటకే పలు కంపె నీలను తీసుకువచ్చి, వారి అర్హతలకు తగిన ఉద్యోగాలను ఎంచుకునే అవకాశాన్ని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కల్పిస్తుంది. ఆరు నెలలుగా మెగా ఉద్యోగ మేళాల రూపంలో సింగేణి ఒక బృహత్తర యజ్ఞాన్ని నిర్విరా మంగా కొనసాగిస్తుంది. దాదాపు 23వేల మంది యువతకు కొలువులను కల్పించి వారిలో నూతన ఉత్సాహం నింపింది.

● రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి సింగరేణి తోడ్పాటు..

నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగావకాశాలు కల్పించాలన్న రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం... మెగా జాబ్ మేళా కార్యక్రమాల నిర్వహణ ద్వారా కార్యరూపం దాల్చుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆలోచనలతో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సౌజన్యంతో ఆరు నెలల్లో 7పట్టణా లలో నిర్వహించిన జాబ్ మేళాలో 66965 మంది నిరుద్యోగ యువత పాల్గొనగా, వీరిలో 23650మందికి ఉద్యోగాలు లభించడం విశేషం. ఏడవ తరగతి మొదలు పోస్ట్ గ్రాడ్యుయేషన్ విద్యార్హతలు గల వారితో పాటు, టెక్నికల్, మెడికల్, పారామెడికల్ తదితర విద్యార్హతలు గల వారికి అర్హతలకు తగిన ఉద్యోగాన్ని ఎంచు కునే అవకాశం దక్కింది. జాబ్ మేళాలో 100 నుంచి 250 వరకు ప్రైవేట్ కంపెనీలు పాల్గొని యువతకు ఉద్యోగావకాశాలు కల్పిం చాయి. జాబ్‌మేళాపై గ్రామాలు, పట్టణాల్లో ప్రచారం చేయడంతో యువతీ యువకులు వేలాదిగా తరలివచ్చారు.

● మేళాలు విజయవంతం...

జాబ్ మేళా కార్యక్రమాలను సంబంధిత ఏరియాల మంత్రులు, ప్రజాప్రతినిధులు ప్రతి ష్టాత్మకంగా చేపట్టారు. జాబ్ మేళా కార్యక్ర మాలను ఏప్రిల్ 21న మధిరలో, 27న భూపాలపల్లిలో, మే 18న గోదావరిఖనిలో మేళాలు నిర్వహించారు. ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, రాష్ట్ర ప్రభుత్వ సలహా దారులు హర్కర వేణుగోపాలరావు, సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్ పాల్గొన్నారు. మే 24న వైరాలో, అక్టోబర్ 25న హుజూర్‌నగర్‌లో, 26 సత్తుపల్లిలో అదే రోజు బెల్లంపల్లిలో జాబ్ మేళా నిర్వహించారు. బెల్లంపల్లిలో పెద్దపల్లి

(మిగతా 8వ పేజీలో)

బహిరంగ ప్రదేశాల్లో మద్యంపై నిషేధం

కోల్‌సిటీ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రామగుండం కమిషనరేట్ పరిధిలో మంచిర్యాల, పెద్దపల్లి జోన్‌లలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను పొడిగిస్తున్నామని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 1వరకు నిషేధం కొనసాగుతాయని తెలిపారు. నిషేధాజ్ఞలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. అలాగే డీజే సౌండ్‌ల వినియోగంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలు పొడిగించామన్నారు. మైక్ సెట్ వినియోగం తప్పనిసరి అయితే డివిజన్ ఏసీపీల అనుమతి పొందాలని సూచించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని, ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించకూడదని, కార్యక్రమాల నిర్వహణకు ముందుగా అనుమతి తీసుకోవాలి, బంద్‌ల పేరిట బలవంతంగా వివిధ సంస్థలు, కార్యాలయాలను మూసి వేయాలని ఒత్తిడి, బెదిరింపులకు గురిచేస్తే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని పోలీస్ కమిషనర్ కోరారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థి


తేజస్విని

ధర్మారం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లాలో 5వ తేదీ వరకు జరిగే 69వ రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ ఫుట్‌బాల్ పోటీలకు ధర్మారం మోడల్ స్కూల్ విద్యార్థి ఎన్ తేజస్విని ఎంపికైనట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఈరవేని రాజ్ కుమార్ తెలిపారు. 9వ, తరగతి చదువుతున్న తేజస్విని ఈ నెల ఒకటిన గోదావరిఖనిలో జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి అండర్ 14 విభాగంలో ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయికి ఎంపికైదన్నారు. ఎంపికైన విద్యార్థిని ప్రిన్సిపాల్ రాజకుమార్‌తోపాటు వ్యాయామ పాఠశాల ఉపాధ్యాయులు బైకని కొమురయ్య, మేకల సంజీవరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

ఒకే గది... ఐదు తరగతులు

- ప్రాథమిక పాఠశాలలో తరగతి గదుల కొరత
- ఇబ్బందులు పడుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



వెంకటాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

మంథనిరూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో తరగతి గదుల కొరతతో ఉపాధ్యాయులు, విద్యార్థులు సమస్యలు ఎదుర్కొం టున్నారు. మంథని మండలంలో 42 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. అందులో 10 పాఠశాలలో సింగిల్ తరగతి గది ఉన్న పాఠశాలలు ఉండగా రెండు పాఠశాలలకు సొంత భవనాలు లేక ప్రైవేటు భవనాలలో పాఠశాలలు నిర్వహిస్తున్నారు. మల్లారం, వెంకటాపూర్, బట్టుపల్లి, శ్రీరాములపల్లి, సూరయ్యపల్లి, కూచిరాజ్‌పల్లి, లక్కారం, తోటగో పాయ్యపల్లి, లక్ష్మీపూర్, ఖైదుపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠ శాలలో వరండా, ఒక తర గతి గది ఉంది. దీంతో ఒకటి నుంచి ఐదు తర గతుల వరకు ఒకటే గదిలో బోధన చేయాల్సిన పరిస్థితి ఉం డటంతో ఉపాధ్యా యులకు, విద్యార్థులకు ఇబ్బందిగా మారింది. ఒకటే గదిలో ఆఫీస్ నిర్వహణ, విద్యాబో ధన చేయాల్సిన పరి స్థితి నెలకొంది. పాఠశాలలు అద నంగా ఉంటే తర గతుల నిర్వహణ సులభతరంగా ఉంటుందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. తరగతుల నిర్వహణ సమయంలో చిన్న పిల్లల అల్లరితో పెద్ద తరగతుల విద్యార్థులు ఇబ్బందులు పడాల్సిన పరి స్థితి నెలకొన్నది. స్వంత భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో బిట్టుపల్లి, కాకర్లపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలను ప్రయివేటు ఇండ్లలో నిర్వహిస్తున్నారు. సింగిల్ తరగతి గదులు ఉన్న పాఠశాలలో అదనపు తరగతి గదులు నిర్మిం చి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.


వెంకటాపూర్ పాఠశాలలో ఒకే తరగతి గదిలో విద్యాబోధన

కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు సిద్ధం

- 6న నిరసనలు... 8న జీఎం కార్యాలయాల ముట్టడి
- ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్

గోదావరిఖని, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు సిద్ధమని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ అన్నారు. ఆదివారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏఐటీయూసీ గుర్తింపు సంఘంగా గెలిచిన తరువాత వివిధ స్థాయిల్లో జరిగిన స్ట్రక్చర్ కమిటీ సమావేశాల్లో సమస్యల పరిష్కారానికి యాజమాన్యం అంగీకరించిందని, వాటిని అమలు చేయడంలో విఫలమైందన్నారు. కార్మికుల సొంతింటి పథకం, కోల్ ఇండియా మాదిరిగా అలవెన్సులపై ఆదాయపు పన్ను యాజమాన్యం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. తొమ్మిది నెలలుగా మెడికల్ బోర్డు నిర్వహించడంలో యాజమాన్యం విఫలమైందన్నారు. యాజమాన్యం మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మెడికల్ ఫిట్ ఐన దాదాపు 300పై చిలుకు డిపెండెంట్‌లకు ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చి ఏండ్లు గడిచినా వారికి ఉద్యోగాలు ఇవ్వడం లేదని, నాన్చివేత ధోరణితో యాజమాన్యం ప్రవర్తిస్తుందన్నారు. డిస్మిస్ అయిన ఉద్యోగులకు మరో అవకాశం కల్పించాలని, 150మస్టర్లు చేయాలనే సర్క్యూలర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 6న అన్నీ గనులు, డిపార్ట్‌మెంట్లలో నిరసన, 8న సింగరేణి వ్యాప్తంగా జీఎం కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించనున్నట్టు తెలిపారు. సమస్య పరిష్కరించకపోతే అన్నీ కార్మిక సంఘాలను కలుపుకుని జేఏసీగా ఏర్పాటు చేసుకుని సమ్మె చేయనున్నట్టు హెచ్చరించారు. నాయకులు ఎల్ ప్రకాష్, మడ్డి ఎల్లయ్య, వైవీరావు, జీగురు రవిందర్, రంగు శ్రీను, సంకె అశోక్, మానాల శ్రీనివాస్, పొన్నాల వెంకటయ్య, కారంపూరి వెంకన్న, ఏ రవికుమార్, గొడిశల నరేశ్, అటికేటి రాజు, బీ శ్రీరాములు, కొప్పుల లింగయ్య, పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలపై నిరసనలు


పెద్దపల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

పెద్దపల్లి కల్చరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై బీజేపీ శ్రేణులు ఆదివారం నిరసన తెలిపారు. పట్టణ, మండల శాఖ ఆధ్వర్యంలో ఆది వారం సీఎం దిష్టిబొమ్మను జిల్లా కేంద్రంలో పలువురు దహనం చేశారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు పెంజర్ల రాకేష్, మండల అధ్యక్షుడు వేల్పుల రమేష్ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో సీఎం దేశాన్ని కించపర్చుతూ చేసిన మాటలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒక వర్గం కోసం దేశ ప్రజల మనోభావాలు దెబ్బతీశారని విమర్శించారు. ఇప్పటికైనా సీఎంతోపాటు మంత్రులు ప్రజలకు క్షమాపణలు చెప్పాలని, లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. సీనియర్ నాయ కులు తంగెడ రాజేశ్వరరావు, పోల్సాని సంపత్ రావు, జిల్లా కార్యదర్శి దాడి సంతోష్, జిల్లా కౌన్సిల్ మెంబర్ రాజగోపాల్, మేకల శ్రీనివాస్, తిరుపతి, పట్టణ, మండల ప్రధాన కార్యదర్శులు సతీష్, పడాల శ్రీధర్, మామిడి ఉమేష్, ఉపాధ్యక్షులు కుమార్, సబ్బు మల్లయ్య, కోశాధికారి సతీష్ పాల్గొన్నారు.

బకాయిల చెల్లింపులు వేగవంతం చేయాలి



ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యవర్గం

పెద్దపల్లి కల్చరల్, నవంబరు2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ బకాయిల వెంటనే చెల్లించాలని ఎస్‌టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఆట సదయ్య డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఐఎంఏ భవన్‌లో జిల్లా శాఖ అధ్యక్షుడు మేరుగు సతీష్ అధ్యక్షతన జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు వేగవంతం చేయాలన్నారు. సంఘాల ప్రాతినిధ్యం మేరకు ప్రతీ నెల 700 కోట్ల బకాయిల చెల్లింపు సంతోషమే అయినా, బకాయిలు పెద్దమొత్తంలో ఉన్నాయని, అవి సరిపోవడం లేదన్నారు. కనీసం రూ.2 వేల కోట్లు ప్రతీ నెల చెల్లించాలని కోరారు. రిటైర్డ్ ఉపాధ్యాయులకు వెంటనే క్లియర్ చేయాలన్నారు. డీఏ బకాయిలు, సీపీఎస్ ఉపాధ్యాయులకు వాయిదాల రూపంలో చెల్లించడం సరికాదన్నారు. అనంతరం ఎస్‌టీయూ జిల్లా కార్యవర్గాన్ని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా నడిపెల్లి సంతోష్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా మేరుగు సతీష్, ఆర్థిక కార్యదర్శిగా మాధవాచారి, రాష్ట్ర కమిటీ సభ్యులుగా మండల శ్రీకాంత్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా బోగె చంద్రశేఖర్, సయ్యద్ ఫయాజుద్దీన్, ఉపాధ్యక్షుడిగా శేషాద్రి, అదనపు జనరల్ సెక్రటరీలుగా తోటరాజు, కిన్నెర శ్రీనివాస్, కార్యదర్శులుగా బడుగు నగేష్, శ్రవణ్ కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీని పలు మండలాల అధ్యక్ష, కార్యదర్శులు అభినందించారు.

రైతులు ఆందోళన చెందవద్దు


కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, నవంబరు2(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని కొనిపించే బాధ్యత తనదేనని, ఈ విషయంలో రైతులు ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు హామీ ఇచ్చారు. గర్రెపల్లి సింగిల్ విండో ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేయించానని తెలిపారు. ఈసారి కూడా రైతులు భరోసాతో ఉండాల న్నారు. ప్రస్తుతం, బకాయి ఉన్న బోనస్ డబ్బులను రైతుల ఖాతాల్లో వేయిస్తామన్నారు. రైతుల సంక్షేమం పట్టని బీఆర్ఎస్, బీజేపీలకు రైతుల గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి కటింగ్ లేకుండా జరుగుతాయన్నారు. గర్రెపల్లిలోని సప్లయి గోదాంకు సంబంధించిన సమస్యను హమాలీలు వివరించగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. బిల్లులు రావడం లేదని పలువురు ఇందిరమ్మ లబ్ధిదా రులు ఆయన దృష్టి తీసుకుపోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశిం చారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాష్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ జూపల్లి సందీప్ రావు, తిరుమలరావు, జానీ, అజయ్ గౌడ్, వెంకటేశం, దీకొండ శ్రీనివాస్, సత్యనారాయణరావు, చక్రధర్, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో సెల్‌టవర్ దగ్ధం

● తప్పిన పెను ప్రమాదం



అన్నారంలో సెల్ టవర్‌లో చెలరేగుతున్న మంటలు

మానకొండూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారం గ్రామంలో ఆదివారం రాత్రి ఓ కంపెనీ సెల్ టవర్ షార్టు సర్క్యూట్‌తో దగ్ధం అయింది. వివరాలు ఇలా ఉన్నాయి.. అన్నారం గ్రామంలోని ఇళ్ల మధ్య నిర్మించిన సెల్ టవర్‌లో షార్టు సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో చుట్టు పక్కల ఇళ్ల వారు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. వెంటనే వారు మానకొండూర్‌లోని ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. సమాచారం తెలుసుకున్న అధికారులు వాహనంతో గ్రామానికి చేరుకున్నారు. సెల్‌టవర్ వద్దకు వెళ్లేందు దారి లేకపోవడంతో మధ్యలోనే వాహనం ఆగిపోయింది. గ్రామ మాజీ ఉపసర్పంచు మూగల మహేందర్‌రెడ్డి ప్రధాన విద్యుత్ సరఫరాను నిలిపి వేయడంతో మంటలు ఆగిపోయాయి. దీంతో పెనుప్రమాదం తప్పడంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు.

సైబర్ నేరగాళ్ల వలలో యువకుడు

● రూ.87 వేలు పోగొట్టుకున్న వైనం

సారంగాపూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సైబర్ వలలో చిక్కుకొని సారంగాపూర్ మండలం బట్టపెల్లి పోతారం గ్రామానికి చెందిన బద్ది రాకేష్ అనే యువకుడు రూ.87 వేలు పోగొట్టుకున్నాడు. పోతారం గ్రామానికి చెందిన బద్ది రాకేష్ అనేయువకుడు జీవనోపాధి కోసం పదిరోజుల క్రితం ఇరాక్ వెళ్ళాడు. అయితే రాకేష్ ఫేస్‌బుక్‌లో వచ్చిన ఓ మెస్సేజ్‌కు లైక్ కొట్టాడు. యూట్యూబర్ హర్షసాయి పేరుతో నకిలీ ప్రొఫైల్ సృష్టించిన సైబర్ నేరగాళ్లు రాకేష్‌తో పరిచయం పెంచుకున్నారు. రాకేష్‌కు నమ్మకం కలిగించేలా హర్షసాయి పేరుతో ఉన్న ఆధార్‌కార్డు పంపించి నీ అప్పులు తీర్చడం కోసం రూ.5 లక్షల ఆర్థికసాయం చేస్తామని నమ్మించారు. అనంతరం ఫోన్‌పే ద్వారా రూ.6.5లక్షలు పంపించినట్లు నకిలి స్క్రీన్‌షాట్ పంపించారు. మీరు పంపించిన డబ్బులు తనకు అందలేదని రాకేష్ అడగడంతో అందుకు ట్యాక్స్ రూపంలో డబ్బులు చెల్లించాల్సి వస్తుందని నమ్మించారు. మోసగాళ్ల మాటలు నమ్మిన రాకేష్ ఆశతో ఇండియాలో ఉన్న తన కుటుంబ సభ్యుల ఖాతా నుంచి విడతల వారీగా రూ.87 వేలు ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా పంపించాడు. ఇంతటితో ఆగని సైబర్ మోసగాళ్లు ఇంకా డబ్బులు పంపించాలని లేని పక్షంలో డిజిటల్ అరెస్ట్ ఉంటుందని భయభ్రాంతులకు గురి చేశారు. దీంతో మోస పోయానని గుర్తించిన రాకేష్ తనకు న్యాయం చేయాలని సైబర్ క్రైం పోలీసులను వేడుకుంటున్నాడు.

అన్నదాతపై అదనపు భారం



జాగీర్‌పల్లిలో నేల వాలిన వరిని కోస్తున్న చైన్ హార్వెస్టర్

● మడుల్లో నిలిచిన నీరు
● పొలాల్లోకి వెళ్లలేక పోతున్న వరికోత యంత్రాలు

సైదాపూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావం వరికోతలపై తీవ్రంగా పడింది. కోతలపై అదనపు భారం పడుతోంది. చాలామంది రైతుల వరిపంటలు నీటిలో మునిగి, నేల వాలి దెబ్బతినగా వరికోసి కుప్పపోసిన ధాన్యం తడిసింది. భూగర్భ జలాలు పెరగడంతో భూమిలో నుంచి జాలు వస్తోంది. ఏకధాటిగా ఎండలు కొడితేనే పొలాలు ఎండాలంటే 15నుంచి 20 రోజులు పట్టే అవకాశముంది. ఈలోపల మళ్లీవర్షం వస్తే ఇక అంతేసంగతులు. పూర్తిగా పంటనష్టపోయే అవకాశముండడంతో రైతులు ఎలాగైనా వరికోసి ధాన్యం అమ్ముకుని గట్టెక్కాలని ఆలోచిస్తున్నారు.

● ఫోర్ వీల్, చైన్ హార్వెస్టర్‌తో కోస్తే అదనపు ఖర్చు

పొలాల్లో నీరు ఆరకపోవడంతో మామూలు హార్వెస్టర్లు దిగబడుతున్నాయి. దీంతో టూ వీల్ హార్వెసర్లు నడవడం లేదు. ఫోర్‌వీల్ గాని, చైన్ మిషన్‌తోనే వరిని కోసే అవకాశముంది. టూవీలర్ మిషన్‌తో వరికోస్తే గంటకు 1,800 నుంచి రెండువేల రూపాయల వరకు ఖర్చువస్తుంది. ఫోర్‌వీల్ గానీ చైన్‌మిషన్‌తో కోస్తే గంటకు మూడు వేల నుంచి 3,500 వరకు తీసుకుంటున్నారు. ఎకరం వరి కోసేందుకు సుమారు దిగబాటును బట్టి గంటన్నర నుంచి రెండు గంటలు పట్టే అవకాశముంది. ఎకరం వరి కోసేందుకు 4,500 నుంచి ఆరు వేల రూపాయల వరకు ఖర్చు వచ్చే అవకాశముంది. ఈ లెక్కన ఎకరాకు సుమారుగా 2500నుంచి నాలుగు వేలవరకు అదనంగా భారం పడుతోంది. వడ్లను తరలించేందుకు కూడా ఫోర్‌వీల్ ట్రాక్టర్లే ఉపయోగించాలి. వాటికికూడా అద్దె ఎక్కువగానే చెల్లించాలి. ఇక నేలవాలిన వరి కోసేందుకు ఒక ఎకరాకు రెండు నుంచి రెండున్నర గంటలు పట్టే అవకాశముంది. అయినా ఖర్చుకు వెనకాడకుండా రైతులు ఫోర్‌వీల్, చైన్ హార్వెస్టర్లతో వరి కోస్తున్నారు. మళ్లీ వర్షం వస్తే పూర్తిగా పంట పోగొట్టుకునే బదులు ఖర్చు పెరిగినా త్వరగా కోసుకొని బయట పడాలని భావిస్తున్నారు. సైదాపూర్ మండలంలో 19వేల ఎకరాల్లో రైతుల వరి పంట సాగు చేశారు.



ధాన్యం తరలిస్తున్న ఫోర్‌వీల్ ట్రాక్టర్

ఖనిలో బీభత్సం సృష్టించిన కారు

● నాలుగు వాహనాలు ధ్వంసం



ప్రమాదానికి కారణమైన కారు

కోల్‌సిటీ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని గాంధీనగర్ లేబర్ కోర్టు వద్ద ఆదివారం రాత్రి ఓ కారు బీభత్సం సృష్టించింది. రాజేష్ థియేటర్ నుంచి చౌరస్తా వైపు వస్తున్న ఏపీ16సీఈ3224 కారు ముందు వెళుతున్న మరో కారును ఢీకొట్టింది. దీంతో కారు ముందు వెళుతున్న మరో కారును ఢీకొనడంతో కారు ముందున్న రెండు బైక్‌లను ఢీకొట్టింది. వరుసగా నాలుగు వాహనాలకు ప్రమాదం ఏర్పడింది. వాహనాల్లో ఉన్నవారు సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాదానికి కారణమైన కారు నడిపిన వ్యక్తి మద్యం మత్తులో ఉన్నట్టు స్థానికులు ఆరోపిస్తూ చితకబాదినట్టు తెలిసింది. డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా ఆర్ఎఫ్‌సీఎల్ టౌన్‌షిప్‌లో మరో కారు ప్రమాదానికి గురైంది. ఆర్ఎఫ్‌సీఎల్‌లో ఎస్‌బీఐ బ్యాంకు మూల మలుపు వద్ద లక్ష్మీపురం నుంచి గోదావరిఖని వైపు వస్తున్న కారు డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురు స్వల్పగాయాలతో బయట పడ్డారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తున్న టిప్పర్ పట్టివేత

బోయినపల్లి నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇసుకను అక్రమ రవాణా చేస్తున్న టిప్పర్‌ను పట్టుకుని డ్రైవర్‌తో పాటు యజమానిపై కేసు నమోదు చేసినట్లు బోయినపల్లి ఎస్సై రమాకాంత్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మండలంలోని విలసాగర్ గ్రామంలో ఆదివారం టీఎస్02 యూఏ 5496 అనే నంబర్‌గల టిప్పర్‌తో ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పోలీసులకు కనిపించగా వాహనాన్ని నిలిపి పత్రాలు పరిశీలించామన్నారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవ డంతో కేసు నిమిత్తం టిప్పర్‌ను పోలీస్‌స్టేషన్ తరలించినట్లు తెలిపారు. డ్రైవర్ దూరిశెట్టి శ్రీనివాస్, వాహన యజమాని అవుదారి రవిందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



పట్టుకున్న టిప్పర్

కొడుకు వేధిస్తున్నాడంటూ పోలీసులకు తల్లి ఫిర్యాదు

హుజూరాబాద్‌రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పెన్షన్ డబ్బుల కోసం కొడుకు వేధిస్తున్నాడంటూ ఓ తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపాపయ్యపల్లి గ్రామానికి చెందిన అజ్మత్‌బీ అనే వృద్ధురాలికి ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. వారిలో ఒక కొడుకు ఇటీవల మరణించాడు. అజ్మత్‌బీ భర్త ప్రభుత్వ ఉద్యోగం చేసి మృతిచెందటంతో ఆమెకు కుటుంబ పెన్షన్ వస్తుంది. ఈ పెన్షన్ డబ్బులతోనే ప్రస్తుతం ఆమె తన కూతుర్ల వద్ద ఆశ్రయం పొందుతూ జీవనం సాగిస్తోంది. జీవనాధారం కోసం వస్తున్న ఆ పెన్షన్ డబ్బులను ఆశించి అజ్మత్‌బీ ప్రస్తుతం ఉన్న కొడుకు ఆమెను నిత్యం వేధిస్తున్నాడు. మద్యం సేవించి వచ్చి పెన్షన్ డబ్బులు ఇవ్వాలంటూ కొడుకు వేధిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు పోలీసులు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.



పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న అజ్మత్‌బీ

నేటి నుంచి ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల బంద్

గణేశ్‌నగర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం నుంచి కళాశాలల నిరవధిక బంద్‌ను నిర్వహిస్తున్నట్లు శాతవాహన యూనివర్సిటీ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం వెంకటేశ్వర్‌రావు తెలిపారు. ఈ మేరకు శాతవాహన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ ఫీజు రీయింబర్సుమెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు మొత్తం ప్రభుత్వం విడుదల చేసే వరకు బంద్‌ను కొనసాగిస్తామని అసోషియేషన్ నాయకులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వనందుకు నిరసనగా ఉమ్మడి జిల్లాలోని 69 డిగ్రీ, 35 పీజీ కళాశాలను నిరవధికంగా బంద్ చేస్తామన్నారు. బకాయిలు విడుదల చేసే వరకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని తెలిపారు.

పిచ్చి కుక్కదాడిలో ముగ్గురికి గాయాలు

ధర్మపురి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలం తిమ్మాపూర్ గ్రామంలో ఆదివారం పిచ్చి కుక్క దాడిలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. గ్రామానికి చెందిన బిసగోని చంద్రయ్య, మొగిలిపాక చంద్రయ్య, బోండ్ల లక్ష్మణ్ అనే వ్యక్తులపై పిచ్చి కుక్క దాడి చేయడంతో బాధితులను వైద్య చికిత్స కోసం ధర్మపురి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దాడి చేసిన కుక్కను స్థానికులు చంపివేశారు. గ్రామంలో విచ్చలవిడిగా కుక్కలు తిరుగుతున్నాయని, వీటిని అరికట్టేందుకు గ్రామపంచాయతీ పక్షాన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ప్రీప్రైమరీ బోధనపై ప్రత్యేక నజర్

● పైలట్ ప్రాజెక్టుగా తాండ్ర్యాల పాఠశాల ఎంపిక
● బోధనాభ్యసన ప్రక్రియపై వీడియో చిత్రీకరణ

కథలాపూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీలో బోధనాభ్యసన ప్రక్రియపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. కథలాపూర్ మండలం తాండ్ర్యాల ప్రాథమిక పాఠశాలలో ఐదేళ్లలోపు పిల్లలు పాఠశాలల పట్ల ఆసక్తి పెంచుకునేలా అభ్యసనా ప్రక్రియలను ఆదివారం ఎస్‌సీఈఆర్‌టీ బృందం సభ్యులు చిత్రీకరణ చేశారు. తాండ్ర్యాల పాఠశాలను పైలట్ ప్రాజెక్టుగా తీసుకొని బాల్యం నుంచే పాఠశాల వాతావరణానికి అలవాటుచేసే విధానాలను ఉపాధ్యాయులతో కలిసి వీడియో తీశారు. ఈ అంశాలను రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలనే ఉద్దేశ్యంలో రాష్ట్ర విద్యా, పరిశోధనా మరియు శిక్షణా మండలి సభ్యులు తాండ్ర్యాల పాఠశాలను ఎంపిక చేసుకున్నారు. ఆటల ద్వారా విద్య పట్ల ఆసక్తిని పెంచే పలురకాల పద్ధతులను ఎస్‌సీఈఆర్‌టీ సభ్యులు గమనించారు. చిన్నారుల మానసిక, శారీరక, సామాజిక అభివృద్ధిని గణనీయంగా పెంచే పద్ధతులను చిత్రీకరణ చేశారు. తోటి పిల్లలతో కలిసి సులభంగా నేర్చుకునే వాతావరణం, ఆత్మ విశ్వాసం, సంభాషణ నైపుణ్యాలను పెంచుకునేందుకు ప్రీప్రైమరీ విద్య ద్వారా అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడతలో వెయ్యిపాఠశాలలను ప్రీప్రైమరీ కింద ఎంపికచేసి విధి విధానాలను రూపొందించాలని నిర్ణయించిన నేపథ్యంలో వీడియో చిత్రీకరణ చేస్తున్నట్టు మాడ్యూల్ రైటర్ గుండు విజయ్ తెలిపారు. మూడు రోజులుగా ఎస్‌సీఈఆర్‌టీ బృందంసభ్యులు చిన్నారులు, ఉపాధ్యాయులతో ఈ కార్యక్రమం చేపడుతుండగా ఆదివారంతో ముగిసిందని పేర్కొన్నారు. ఇటీవల ప్రభుత్వం ప్రీప్రైమరీ నిర్వహణకు ఇన్‌స్ట్రక్టర్లు, ఆయాలను నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసిన క్రమంలో వారికి శిక్షణ కోసం ఈ వీడియోను మోడల్‌గా చూపనున్నారని సభ్యులు ఈశ్వర్, మురళి, పృథ్వీ తెలిపారు.



తాండ్ర్యాల పాఠశాలలో చదువుకుంటున్న ప్రీప్రైమరీ విద్యార్థులు



తాండ్ర్యాల పాఠశాలలో వీడియో చిత్రీకరిస్తున్న ఎస్‌సీఈఆర్‌టీ బృందం సభ్యులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

● దుమాలలో విషాదం



అంజయ్య(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధానరహదారిపై ఆదివారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో మండలంలోని దుమాల గ్రామానికి చెందిన వ్యక్తి జాలపల్లి అంజయ్య(34) అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ప్రత్యక్ష సాక్షులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని అంజయ్య పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. తన ద్విచక్రవాహనంపై గ్రామశివారులోని ఓ పంపులో పెట్రోలు పోయించుకునేందుకు వెళుతున్నాడు. నిజామాబాద్ ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు కామారెడ్డి నుంచి రాచర్ల గొల్లపల్లి మీదుగా కరీంనగర్ వెళుతున్న క్రమంలో అంజయ్య బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య సుస్మిత ఉంది. సమాచారం అందుకున్న ఎస్ఐ రాహుల్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి



ప్రమాదం నుంచి బయటపడిన బాలుడు

పాలకుర్తి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): బసంత్‌నగర్ సమీపంలోని కన్నాల రైల్వేగేట్ వద్ద ఆదివారం సాయంత్రం గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. బసంత్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. హుస్నాబాద్ మండలం కుచనపల్లి గ్రామానికిచెందిన సోయం శ్రీధర్ (35) ద్విచక్రవాహనం (టీఎస్ 36హెచ్ 9800)పై గోదావరిఖనికి వచ్చాడు. ఆదివారం సాయంత్రం గోదావరిఖని నుంచి కుచనపల్లి గ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. శ్రీధర్ తలపైనుంచి వాహనం వెళ్లడంతో నుజ్జునుజ్జు అయ్యింది. శ్రీధర్ అక్కడికక్కడే మృతిచెందగా కుమారుడు ప్రాణాలతో బయట పడ్డట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



సురేందర్(ఫైల్)

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని చికిత్స పొందుతూ ఒకరు మృతిచెందిన సంఘటన మండలంలోని మీర్జంపేటలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. శనివారం రాత్రి గ్రామానికి చెందిన రామంచ సురేందర్(42) రోడ్డు పక్కన నడుచుకుంటూ ఇంటికి వెళుతుండగా షబీర్ అనేకారు డ్రైవర్ కారును అతివేగంగా నడిపి సురేందర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సురేందర్‌కు తీవ్ర గాయాలు కాగా మెరుగైనవైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స అందిస్తుండగా ఆదివారం మృతిచెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

బాయిలర్ పేలిన ఘటనలో కార్మికుడి మృతి



కుమార్(ఫైల్)

సుల్తానాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాట్నపల్లి శివారులోని కనకదుర్గ రైస్‌మిల్లులో మూడురోజుల క్రితం బాయిలర్ పేలిన ప్రమా దంలో గాయపడిన గంగారపు కుమార్(44) అనేకార్మికుడు చికిత్సపొందుతూ మృతిచెందాడు. గతనెల29న మిల్లులో జరిగిన ప్రమాదంలో గంగారపు కుమార్, కుమారస్వామి కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని కరీంనగర్ ఆసుపత్రికి తరలించి, చికిత్స అందిస్తుండగా ఆదివారం కుమార్ మృతిచెందాడు. కుమార్ సుల్తానాబాద్‌లోని మార్కండేయకాలనీ నివాసి. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి కుటుం బానికి నష్టపరిహారం చెల్లించాలని పలువురు డిమాండ్ చేశారు. కుమార్ మృతదేహానికి కరీంనగర్‌లో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

వాహన తనిఖీలు చేసిన పోలీసులు

● డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 30మందిపై కేసు

జగిత్యాల టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలో శనివారం అర్ధరాత్రి ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు జగిత్యాల పట్టణ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. పట్టణంలోని కొత్త బస్టాండ్ కూడళ్లలో పలు ప్రాంతాల్లో పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 30మందిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు. పట్టణంలోని పలువీధుల్లో సీఐ కరుణాకర్, ట్రాఫిక్ ఎస్సైమల్లేశం బైక్‌పై తిరుగుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పట్టణంలోని పలులాడ్జిలను ఆకస్మిక తనిఖీలు నిర్వహించి ఇతర ప్రాంతాలనుంచి వచ్చి బసచేస్తున్న వారి వివరాలు పరిశీలించారు. ఈ తనిఖీల్లో పట్టణ ఎస్ఐలు కుమారస్వామి, రవికిరణ్, సుప్రియ, ట్రాఫిక్ ఎస్ఐ మల్లేశం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



డ్రంకెన్‌డ్రైవ్ టెస్ట్ చేస్తున్న పోలీసులు

వేములవాడలో కార్తీక భక్తుల రద్దీ

వేములవాడ టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వేములవాడ కార్తీక మాసం సందర్భంగా ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు రాజరాజేశ్వర స్వామివారిని, భీమేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. భీమేశ్వరాలయంలో అభిషేకం, అన్నపూజ తదితర ఆర్జితసేవలలో పాల్గొన్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కును చెల్లించుకున్నారు. కార్తీకమాసం సందర్భంగా భక్తులు ఆలయ ఆవరణలో కార్తీకదీపాలను వెలిగించారు. ఆలయ అభివృద్ధి పనులు ప్రారంభమైన కారణంగా రాజరాజేశ్వర స్వామివారి దేవస్థానంలో భక్తులను సాధారణ దర్శనాలకు మాత్రమే అనుమతిస్తున్నారు. అన్నిరకాల ఆర్జితసేవలను భీమేశ్వరాలయంలోనే కొనసాగిస్తున్నారు. భక్తులకు ఎలాంటిఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు తగినఏర్పాట్లు చేపట్టారు.

బద్ది పోచమ్మ ఆలయంలో..

వేములవాడ పట్టణంలోని బద్ది పోచమ్మ ఆలయం ఆదివారం భక్తులతో రద్దీగా మారింది. ఈ సందర్భంగా వారు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనం సమర్పించారు. పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులతో బద్దిపోచమ్మ ఆలయపరిసరాలు కిక్కిరిసి పోయాయి.



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



బద్దిపోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

నరసింహుడి క్షేత్రంలో..

ధర్మపురి: కార్తీక మాసం సందర్భంగా ధర్మపురి క్షేత్రంలో ఆదివారం భక్తజనం పోటెత్తింది. దీంతో క్షేత్రంలోని లక్ష్మీనృసింహస్వామి, అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం వరకు సుదూర ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలి వచ్చారు. గోదావరి నదిలో స్నానాలు ఆచరించి మహిళలు దొప్పలో కార్తీక దీపాలు వదిలారు. అనంతరం లక్ష్మీనరసింహ స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. ఆలయం ఆవరణలో గల ఉసిరిక చెట్టు చుట్టు ప్రదక్షిణలు చేసి కార్తీక దామోదరుడిని పూజించారు. మహిళలు దీపాలు, వత్తులు వెలిగించి భక్తిశ్రద్ధలతో పూజించారు.



ధర్మపురిలో ఉసిరిక చెట్టు వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు

నరసింహుని దర్శనం చేసుకున్న అదిరే అభి

ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని జబర్దస్త్ ఫేమ్ అదిరే అభి సందర్శించారు. ఆలయంవద్ద ఆయనకు అర్చకులు స్వాగతంపలికారు. అనంతరం స్వామి సన్నిధిలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. వేదపండితులు, అర్చకులు ఆయనను ఘనంగా ఆశీర్వదించారు. స్వామిశేషవస్త్రం, చిత్రపటం, ప్రసాదాలు అందించారు.

ముగిసిన శ్రీచైతన్య స్కాలర్‌షిప్ టెస్ట్



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న శ్రీచైతన్య విద్యాసంస్థల అధినేత ఎం రమేశ్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): శ్రీచైతన్య స్కాలర్ షిప్ టెస్ట్‌కు విశేషస్పందన లభించినట్లు కళాశాల యాజమాన్యం ప్రకటించింది. శ్రీచైతన్య ఐఐటీ, నీట్ అకాడమీ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ఆదివారం నిర్వహించిన ఈ స్కాలర్‌షిప్ టెస్టుకు 12,519 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపింది. శ్రీచైతన్య విద్యాసంస్థలకు చెందిన 10 కళాశాలల్లో పరీక్షను విజయవంతంగా నిర్వహించారు. హాజరైన విద్యార్థులను విద్యాసంస్థల అధినేత ముద్దసాని రమేశ్‌రెడ్డి అభినందించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కాలర్‌షిప్ టెస్ట్‌కు అత్యధిక సంఖ్యలో విద్యార్థులు హాజరు కావడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులను ప్రోత్సహించిన తల్లిదండ్రులు, పాఠశాలల ఉపాధ్యాయులకు, కరస్పాండెంట్లకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఆర్థిక స్థోమత లేని ప్రతిభగల విద్యార్థులకు ఉచిత, రాయితీతో ఐఐటీ, జేఈఈ మేయిన్స్, నీట్, ఎప్‌సెట్ శిక్షణతో కూడిన ఇంటర్మీడియెట్ విద్యను కార్పొరేట్ స్థాయిలో అందించాలని టెస్టును నిర్వహించినట్లు తెలిపారు. పరీక్షలోని మార్కుల ఆధారంగా 100శాతం ఉచిత విద్య అందిస్తామని ప్రకటించారు. మొదటి బహుమతి విద్యార్థికి ల్యాప్‌టాప్, రెండు నుంచి 10 మందికి ట్యాబ్స్, రివార్డులు అందజేయనున్నట్లు చెప్పారు. పరీక్షకు హాజరైన విద్యార్థులకు కూపన్లను అందజేసి లక్కీ డ్రా తీసి ముగ్గురికి ప్రోత్సాహక బహుమతులుగా స్మార్ట్‌టీవీ, సైకిల్, సెల్‌ఫోన్‌ను అందిస్తామన్నారు. కార్యక్రమంలో శ్రీచైతన్య సంస్థల డైరెక్టర్ కర్ర నరేందర్‌రెడ్డి, డీన్ జగన్‌మోహన్‌రెడ్డి, శ్రీచైతన్య కళాశాల ప్రిన్సిపాల్‌లు, ఏజీఎం తదితరులు పాల్గొన్నారు.

ఇంటికి దీపం ఇల్లాలు

నేడు ప్రపంచ గృహిణుల దినోత్సవం



కరీంనగర్ కల్చరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గృహిణీ గృహముచ్యతే... ఇంటిని చూస్తే ఇల్లాలి సంగతి తెలుస్తుంది... ఇంటికి దీపం ఇల్లాలు అనే సామెతలు వింటూనే ఉంటాం. అనాది నుంచి గృహిణులకు ప్రాధాన్యం ఉంది. యజమాని చేసే అన్ని పనుల్లో యజమానురాలైన గృహిణి పాత్ర కూడా ఉంటుంది. కొన్ని వైదిక, ధార్మిక, శుభా శుభ కర్మలు ఆచరించే సమయంలో భార్య భర్త ప్రక్కన ఉండాలని శాస్త్రం కూడా చెబుతోంది. భార్యగా, తల్లిగా, చెల్లిగా, కోడలుగా, కూతురుగా గృహిణికి మన ధర్మంలో ప్రత్యేక స్థానం ఉంది. ఈ దిశలో ప్రపంచ గృహిణుల దినోత్సవాన్ని (నేషనల్ హోమ్ మేకర్స్ డే) ప్రతీ యేటా నవంబరు 3వ తేదీన జరుపుకుంటారు.

● **ఉద్దేశం...**

గృహాలను చక్కగా నడిపించడంలో, కుటుంబాన్ని చూసుకోవడంలో గృహిణులు చేసే నిస్వార్థ, అవిశ్రాంత సేవలు, కృషిని ఈ దినోత్సవం గుర్తిస్తుంది. ఇంటిని ప్రేమతో, శ్రద్ధతో చూసుకునే అందరినీ అభినందించడమే ఈ దినోత్సవ లక్ష్యం. గృహిణుల శ్రమ, త్యాగాలను ప్రత్యేకంగా గుర్తించడానికి ఈ రోజును అంకితం చేశారు.

కుటంబ సభ్యులు గృహిణులకు ధన్యవాదాలు తెలుపుతూ బహుమతులు, విందు వంటివి ఏర్పాటు చేయాలి. పిల్లలు తమ తల్లులకు పాదపూజ చేసి గౌరవించాలి.



● **మోయలేని భారం మోస్తూ...**

గృహిణులు నేటి కాలంలో ఒక్కో సందర్భంలో మోయలేని భారం మోస్తూ ముున్ముందుకు సాగుతున్నారు. భర్త మరణించినా, అందుబాటులో లేకున్నా తానే అన్ని అనుకొని పిల్లల కోసం వ్యయ ప్రయాసలకోరుస్తూ కుటుంబానికి బాసటగా నిలుస్తున్నారు. మధ్య తరగతి వారైతే కూలీ నాలీ చేసి తమ పిల్లలను చదివించి ప్రయోజకులుగా తీర్చిదిద్దుతు న్నారు. అటువంటివారి ఋణం ఏమిచ్చినా తీర్చుకోలేనిది. ఇందుకు వారు కోరుకునేది ఒక ప్రేమ, గుర్తింపు, అభినందన, మహా అయితే ఓ చిన్న పొగడ్త మాత్రమే. ముఖ్యంగా పల్లెల్లో గృహిణుల శ్రమ వెల కట్టలేనిది. రోజంతా అలు పెరుగక కష్టపడుతూనే ఉంటారు. ఈ మధ్య నగరాల్లో నూటికి యాభైఐదు నుంచి అరవై శాతం గృహిణులు తమ విధ్యుక్త ధర్మాలను నెరవేరుస్తున్నారు. మిగిలిన నలభై శాతంలో ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తూ లేదా భర్త సంపాదించగా వచ్చిన డబ్బును ఆచితూచి ఖర్చు చేస్తూ జీవిస్తున్నవారున్నారు. సంపాదన ఎలా వచ్చినా, ఎరిదైనా ఇంటిని, కుటుంబాన్ని కంటికి రెప్పలా కాపాడుతూ శ్రమైక జీవన సౌందర్యాన్ని సొంతం చేసుకున్న గృహిణులు చిరస్థాయిగా నిలిచిపోతూనే ఉంటారు. అందుకే గృహిణులను గౌరవిద్దాం. గృహిణుల గొప్పదనాన్ని లోకానికి చాటుదాం.

కన్నుల పండువగా వేంకటేశ్వరస్వామి కల్యాణం


ముస్తాబైన ఉత్సవ విగ్రహాలు

కోరుట్ల రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపూర్‌లో వేంకటేశ్వర స్వామి కల్యాణం కన్నుల పండంగా జరిగింది. ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం వేంకటేశ్వర స్వామి కల్యాణం గ్రామస్థుల ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్ఛరణ మధ్య వైభవంగా సాగింది. ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చన, అభిషేక కార్యక్రమాలను నిర్వహించిన వేదపండితులు ప్రత్యేక వేదికపై స్వామి వారి కల్యాణాన్ని జరిపారు. మొదట గ్రామస్థుల అధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి, అలువేలు మంగ, పద్మావతి ఉత్సవమూర్తులకు ప్రత్యేక అలంకరణ చేసి బాజా బాజత్రీల మధ్య శోభాయాత్రను గ్రామం నుంచి ఆలయం వరకు నిర్వహించారు. శోభాయాత్రకు మహిళలు మంగళహారతులో స్వాగతం పలకగా వేదపండితులు ప్రత్యేక పూజలను నిర్వహించిన అనంతరం కల్యాణం నిర్వహించారు. గ్రామస్థుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు-సరోజన దంపతులు ప్రారంభించి ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బోయినిపల్లి సత్యంరావు, మాజీ ఎంపీపీ తోట నారాయణ, సర్పంచ్‌ల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తోట శారద-లింగారెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రాజేష్, సభ్యులు రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ బర్కం నర్సయ్య పాల్గొన్నారు.


కల్యాణంలో పాల్గొన్న భక్తులు

శ్రీరాంసాగర్‌కు కొనసాగిన వరద



జగిత్యాల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద నీరు రావడం ఆదివారం కొనసాగింది. 16 వరద గేట్లు ఎత్తి దిగువ గోదావరిలోకి 47,059 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా కాకతీయ కాలువ, సరస్వతి కాలువ, మిషన్ భగీరథ, వరద కాలువ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 56,513 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో ఎస్కేప్ గేట్ల ద్వారా ఎనిమిది వేల క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 650 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతున్నాయి.

వైద్యులకు సహాయసహకారాలు అందిస్తాం

- మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ
- ఘనంగా రాష్ట్ర ఐఎంఏ ప్రమాణస్వీకారోత్సవం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వైద్యులు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

సుభాష్‌నగర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ల సమస్యలు పరిష్కరించడంతోపాటు వారికి అన్నివేళలా సహాయ సహకారాలను అందిస్తుందని మానకొండూర్ శాసన సభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ఆదివారం కరీంనగర్ లోని వీ కన్వెన్షన్‌లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ... డాక్టర్లు ఎప్పుడు పేషంట్‌ను రక్షించడానికి ప్రయత్నిస్తారని అన్నారు. కొన్ని సందర్భాల్లో పేషంట్ ఆరోగ్య పరిస్థితి విషమించి చనిపోతే అందుకు వైద్యులను బాధ్యులను చేస్తూ ఆసుపత్రులపై దాడులకు పాల్పడడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైద్యులకు అండగా ఉంటుందని తెలిపారు. వైయస్సార్ హయాంలో వైద్యులకు భద్రత కల్పించేందుకు ప్రత్యేక చట్టాన్ని తీసుకువచ్చారని తెలిపారు. అంతేకాకుండా దివంగత ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి వైద్య విద్యార్థులకు ఇచ్చే స్టైఫండ్‌ను రెండింతలు చేశారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. మిక్సోపతిని వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. అన్నివర్గాలకు కమిషన్ ఉందని డాక్టర్లకు కూడా నిష్ణాతులైన వైద్య నిపుణులతో కమిషన్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కరీంనగర్ ఐఎంఏకు స్థలం కావాలని కరీంనగర్ ఐఎంఏ మాజీ అధ్యక్షుడు డాక్టర్ నరేష్ తన హయాంలో ప్రభుత్వానికి వినతిపత్రం అందజేశారని తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి స్థలం కేటాయింపు కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ... కరీంనగర్ మెడికల్ హబ్‌గా అభివృద్ధి చెందిందని అన్నారు. ఐఎంఏ ఆధ్వర్యంలో చేపట్టిన సామాజిక సేవ కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు.

రాష్ట్ర కార్యవర్గం ప్రమాణ స్వీకారం...

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. అధ్యక్షుడిగా డాక్టర్ పి కిషన్, కార్యదర్శిగా వి అశోక్, కోశాధికారిగా డాక్టర్ దయాల్ సింగ్, ఉపాధ్యక్షులుగా డాక్టర్ విజయరావు, డాక్టర్ ఎంఎల్ఎన్ రెడ్డి, డాక్టర్ బి శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శులుగా డాక్టర్ టీవీ శ్రీనివాస్, డాక్టర్ ఆర్ సునీత, డాక్టర్ పి శరత్‌చంద్ర, డాక్టర్ యు రామకృష్ణ, డాక్టర్ బి రూపులాల్ ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన వైద్య నిపుణులు సైంటిఫిక్ సెషన్స్ నిర్వహించారు. కరీంనగర్ ఐఎంఏ రాష్ట్రంలో అన్ని విభాగాలలో ఉత్తమ బ్యాంచిగా ఎన్నికైంది. దానికి సంబంధించి మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎనమల్ల నరేష్ అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా వివిధ వ్యాధులకు సంబంధించిన అధునాతన వైద్యం, శస్త్ర చికిత్స విధానాల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ మాజీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బీఎన్‌రావు డాక్టర్ శ్యాంసుందర్, డాక్టర్ విజయేందర్ రెడ్డి, డాక్టర్ రామ్‌కిరణ్, పొలాస కరీంనగర్ అధ్యక్షురాలు డాక్టర్ ఆకుల శైలజ, కార్యదర్శి డాక్టర్ మహేష్‌బాబు, కోశాధికారి డాక్టర్ నీలిమ మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎనమల్ల నరేష్ మాజీ కార్యదర్శి డాక్టర్ నవీన్ కుమార్, మాజీ కోశాధికారి డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ వసంతరావు డాక్టర్ అలీం, డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గోదావరి హారతి


గోదావరి నదికి హారతి ఇస్తున్న అర్చకులు

ధర్మపురి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరి హారతి పన్నెండో రోజు ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసం ఆరంభం నుంచి జరిగే కార్యక్రమంలో భాగంగా ఆలయ వేదపండితులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు, మహిళలు మంగళ వాయిద్యాలు వెంటరాగా గోదావరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయ వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు నది వద్ద విశేష పూజలు నిర్వహించారు. గంటల తరబడి రాత్రి వరకు నదీ మాతకు హారతి ఇచ్చి కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి వేళలో మహిళలు దొప్పల్లో దీపాలు వెలిగించి గోదావరి నదిలో వదిలారు.

ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు సీహెచ్ రమణాచార్యా, నంబి నరసింహమూర్తి, ఆలయ అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, అర్చకులు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఉమ్మడి జిల్లాస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు


హాజరైన వివిధ జిల్లాల క్రీడాకారులతో ప్రతినిధులు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఉమ్మడి జిల్లాస్థాయి ఓపెన్ టేబుల్ టెన్నిస్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఆదివారం కేహెచ్ఆర్ అకాడమీలో కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల అండర్-14, 17, 19 ఉమెన్, మెన్, బాలబాలికల విభాగంలో అకాడమీ డైరెక్టర్ గౌతమ్‌రెడ్డి ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు.

కరెంట్ డిపార్ట్‌మెంట్ ఏవో లక్ష్మణ్, ఇంటెలిజెన్స్ డీఎస్పీ ఎండి గౌస్ బాబా, సీఐ ప్రవీణ్‌రాజ్ పోటీలను ప్రారంభించారు. ఇటీవల నిర్వహించిన ఎస్‌జీఎఫ్ కరీంనగర్ ఉమ్మడి జిల్లాస్థాయి టేబుల్ టెన్నిస్ క్రీడా పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు గర్రెపల్లి పురుషోత్తంరావు, సరోజ క్యాటరేస్ హాస్టల్స్ డైరెక్టర్ సత్యనారాయణ పటేల్ టీ షర్టులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువు తోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. అనంతరం గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కేహెచ్ఆర్ అకాడమీ డైరెక్టర్ గౌతమ్‌రెడ్డి, రాకేష్, మహేష్, సత్యనారాయణ, రాకేష్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.


బాలికల విజేతలతో అతిథులు

అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో 'కర్ర' ప్యానల్ విజయం

- తొమ్మిది మంది డైరెక్టర్ల గెలుపు - రెండు స్థానాలకే నిర్మల్ భరోసా ప్యానల్ పరిమితం - గడ్డం విలాస్‌రెడ్డి ప్యానల్‌కు చుక్కెదురు - ఉదయం 8 గంటలకు ఫలితాల వెల్లడి

ఎన్నికైన డైరెక్టర్లు వీరే..


సరిల్ల రతన్ రాజు


ముద్దసాని శ్వేత


వరాల జ్యోతి


దేవ వేద్రాది


కర్ర రాజశేఖర్


ఉయ్యాల ఆనందం


బండి ప్రశాంత్


తాడ వీరారెడ్డి


బాశెట్టి కిషన్


బొమ్మరాతి సాయికృష్ణ

కరీంనగర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉత్కంఠ భరితంగా సాగిన కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో మాజీ చైర్మన్ కర్ర రాజశేఖర్ ప్యానల్ విజయం సాధించింది. కర్ర రాజశేఖర్ పార్టీలకతీతంగా 12 మందితో ఏర్పాటు చేసిన ఇండిపెండెంట్ ప్యానల్ నుంచి తొమ్మిది మంది అభ్యర్థులు డైరెక్టర్లుగా గెలుపొందారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన తాజా మాజీ చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి ప్యానల్‌లో పోటీచేసిన 11మంది ఓటమిపాలయ్యారు. కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు మద్దతుతో 12 మంది అభ్యర్థులతో ఏర్పాటు చేసిన నిర్మల్ భరోసా ప్యానల్‌లో ఇద్దరు మాత్రమే గెలుపొందారు. 18 మంది అభ్యర్థులు ఇండిపెండెంట్‌గా బరిలో నిలిచినా కన్న సాయి మాత్రమే విజయం సాధించారు. కరీంనగర్, జగిత్యాలలో కలిపి 9,287 మంది ఓటర్లు ఉన్నారు. కరీంనగర్, జగిత్యాలలో కలిపి 4,114 ఓట్లు పోలయ్యాయి. 44.23 శాతం మంది సభ్యులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. శనివారం సాయంత్రం ఐదు గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రారంభించగా రాత్రంతా ఓట్ల లెక్కించారు. ఆదివారం ఉదయం ఎనిమిది గంటలకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జగిత్యాల డీసీవో సీహెచ్ మనోజ్‌కుమార్ ఫలితాలను ప్రకటించి, ఎన్నికైన వారికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.


కన్న సాయి


అనురాస్ కుమార్

● **విజేతలు వీరే...**

- ఎస్సీ, ఎస్టీ కేటగిరిలో..

ఒక ఎస్సీ, ఎస్టీ డైరెక్టర్ స్థానంలో అనంతరాజు మన్నెకు 552 ఓట్లురాగా అనిసిరి ఆనంద్‌కు 528, అలుగు విద్యాసాగర్ 118, బత్తుల రాజ్‌కుమార్‌కు 208, ముషీరాబాద్ లింగరాజుకు 132, లింగంపల్లి శ్రీనివాస్‌కు 357, లింగంపల్లి సత్యనారాయణకు 469, సరిళ్ల రతన్ ప్రసాద్‌కు 856 ఓట్లు వచ్చాయి. అత్యధిక ఓట్లు సాధించిన సరిళ్ల రతన్‌ప్రసాద్ గెలుపొందారు

- మహిళా డైరెక్టర్లకు..

రెండు మహిళా డైరెక్టర్ పోస్టులకు కంజర్ల రేణుకకు 589 ఓట్లు రాగా, దామెర శ్రీలతలకు 819, ముద్దసాని శ్వేతకు 1710, మునిపల్లి ఫణితకు 1150, వరాల జ్యోతికి 2,119 ఓట్లు వచ్చాయి. అత్యధికంగా ఓట్లు సాధించిన వరాల జ్యోతి, ముద్దసాని శ్వేత డైరెక్టర్లుగా ఎన్నికయ్యారు.

- జనరల్ స్థానంలో

జనరల్ కేటగిరిలో అత్యధిక ఓట్లు సాధించిన కర్ర రాజశేఖర్ (1,959), బొమ్మరాతి సాయికృష్ణ (1,292), దేశ వేద్రాది (1,245), కన్న సాయి (1,220), బాశెట్టి కిషన్ (1,119), బండి ప్రశాంత్‌దీపక్ (1,035), అనరాసు కుమార్ (1,015), తాడ వీరారెడ్డి (987), ఉయ్యాల ఆనందం (9,19) గెలుపొందినట్లు అధికారులు తెలిపారు. వీరిలో అనరాసు కుమార్, ఉయ్యాల ఆనందం నిర్మలా భరోసా ప్యానల్, కన్న సాయి ఇండిపెండెంట్ కాగా మిగతా వారందరూ కర్ర రాజశేఖర్ ప్యానల్‌కు చెందిన వారు.

● **భారీగా చెల్లని ఓట్లు..**

4114 ఓట్లు పోల్ కాగా 1,544 ఓట్లు చెల్లకుండా పోయాయి ఎస్సీ, ఎస్టీ కేటగిరీలో అత్యధికంగా 894 ఓట్లు, మహిళా కేటగిరిలో 294, జనరల్ కేటగిరీలో 356 ఓట్లు చెల్లలేదు. ఎక్కువ ఓట్లు చెల్లకుండా పోవడంతో గెలుపుపై ప్రభావం చూపిందని పలువురు ఓడిపోయిన అభ్యర్థులు ఆవేద వ్యక్తం చేశారు.

● **నేడు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక..**

అర్బన్ బ్యాంకు పాలకవర్గ సభ్యులుగా ఎన్నికైన 12 మంది డైరెక్టర్లలో ఒకరిని చైర్మన్‌గా, మరొకరిని వైస్ చైర్మన్‌గా ఎన్నుకునేందుకు బ్యాంకులో ఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల అధికారి, జగిత్యాల డీసీవో సీహెచ్ మనోజ్‌కుమార్ తెలిపారు. రహస్య ఓటింగ్ పద్ధతిలో జరిగే ఈ ఎన్నికలకు ఉదయం 9 నుంచి 11 గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. 12 నుంచి 2 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఇస్తారు. 2.30కు తుదిజాబితాను విడుదల చేస్తారు. మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు ఎన్నికలు నిర్వహించి, సాయంత్రం 5.30 గంటలకు ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడిస్తారు.

● **కర్ర రాజశేఖర్ ఎన్నిక లాంఛనమే...**

ఇండిపెండెంట్ ప్యానల్‌ను ఏర్పాటు చేసి తొమ్మిది మందిని డైరెక్టర్లుగా గెలిపించుకున్న మాజీ చైర్మన్ కర్ర రాజశేఖర్ మూడోసారి ఎన్నిక కావడం లాంఛనమే. మిగిలిన రెండు ప్యానళ్లలో నుంచి నిర్మల్ భరోసా ప్యానల్‌లో ఇద్దరు మాత్రమే గెలిచారు. ఇండిపెండెంట్లలో ఒక్కరే కన్న సాయి గెలిచారు. ఆయన కూడా కర్ర రాజశేఖర్ వర్గంలో చేరడంతో రాజశేఖర్ చైర్మన్ గెలుపు లాంచనం కానుంది. కర్ర రాజశేఖర్ ప్యానల్ నుంచి గెలిచిన వేద్రాది, వరాల జ్యోతి, కన్నసాయి బీజేపీకి, మిగిలిన తొమ్మిది మంది కాంగ్రెస్‌కు చెందిన వారు.

వైభవంగా శ్రీ కృష్ణ తులసి కల్యాణం


తులసి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వేములవాడ టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా అనంత పద్మనాభ స్వామి మండపంలో ఆదివారం రాత్రి కృష్ణ తులసి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో కార్తీక శుద్ధ ద్వాదశి సందర్భంగా రుక్మిణి విఠలేశ్వరస్వామి వారికి పంచపనిషత్తు ద్వారా అభిషేకం చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు ఆనందిని ఎంపిక


ఆనందిని

వేములవాడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణానికి చెందిన బయాన ఆనందిని అనే బాలిక జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికైనట్లు కుటుంబసభ్యులు ఆదివారం తెలిపారు. మహబూబాబాద్ జిల్లాలో జరిగిన 69వ రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికైనట్లు ఆర్చరీ జిల్లా సెక్రెటరీ కొమురోజు శ్రీనివాస్, కోచ్‌లు శ్రీనివాస్, అభిషేక్‌లు వెల్లడించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వేములవాడ మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ బింగి మహేష్ ఆనందినినీ అభినందించారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

ముత్తారం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతారం గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వారం, ఇదులాపూర్ వెళ్లే కూడలి వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. రోడ్డుకు సమాంతరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండటం, అలాగే ట్రాన్స్‌ఫార్మర్ చుట్టు రక్షణ కంచె ఏర్పాటు చేయకపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. నిత్యం ఈ రోడ్డు గుండా వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు కొనసాగుతాయి. గడ్డి మేస్తూ పశువుల అటుగా వెళ్తే విద్యుత్ షాక్‌కు గురయ్యే అవకాశాలున్నాయి. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ ఎత్తు పెంచాలని, పిచ్చి మొక్కలను తొలగించి, రక్షణ కంచె ఏర్పాటు చేయాలని రైతులు, వాహనదారులు కోరుతున్నారు.

ఘనంగా అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు



పూజలు చేస్తున్న వేదపండితులు

కాల్వశ్రీరాంపూర్, నవంబరు2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పాండవుల గుట్టపై నిర్మించిన అయ్యప్ప ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఉదయం సహస్ర కలశ ఆవాహన, చండీహోమాలు, సర్వదేవతార్చనలు, ఉత్సవ విగ్రహాలకు అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. చంద్రమౌళి గురు స్వామి, చంద్రమౌళి వెంకటేష్ శర్మ ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎంపీపీ గోపగాని సారయ్యగౌడ్, సింగిల్‌విండో చైర్మన్ చదువు రామచంద్రారెడ్డి, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్యలు ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం జరగనున్న అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠాపనలో భక్తులు, ప్రజలు, పెద్ద సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

అంధకారంలో ఆసుపత్రి ప్రధాన రహదారి



అంధకారంలో ఉన్న జనరల్ ఆసుపత్రి ప్రధాన రహదారి

కళ్యాణ్‌నగర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి వెళ్లే ప్రధాన రహదారిపై విద్యుత్ దీపాలు వెలగక పోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం రోగులతో రద్దీగా ఉండే ప్రభుత్వాసుపత్రికి రాత్రి వేళ రోగులు వస్తుంటారు. 20 రోజులుగా విద్యుత్ దీపాలు వెలగక పోవడంతో చీకట్లో ఆసుపత్రికి వెళ్లాలంటే రోగులు భయపడుతున్నారు. వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం నుంచి ఆసుపత్రికి వెళ్లే రహదారితోపాటు శారదానగర్ ట్రాన్స్‌కో కార్యాలయం నుంచి వెళ్లే రహదారిలో వీధి దీపాలు వెలగక పోవడం, రాత్రి వేళల్లో అక్కడ ఉన్న ఖాళీ స్థలాల్లో మందుబాబులు అడ్డాలు వేస్తున్నారు. కార్పొరేషన్ పక్కనే ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

యువతకు అండగా సింగరేణి

(5వ పేజీ తరువాయి)

ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యే గడ్డం వినోద్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

సింగరేణి సంస్థ తన సామాజిక బాధ్యత కార్యక్రమాల్లో భాగంగా జాబ్ మేళా నిర్వహించడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్టాల్స్ ఏర్పాటు, ప్రచారం, భోజనం, హైదరాబాద్ నుంచి విచ్చేసిన ప్రైవేటు కంపెనీల ప్రతినిధులకు సౌకర్యాలు, మంచినీటి వసతి, సింగరేణి అధికారులు, ఉద్యోగులు, సింగరేణి సెక్యూరిటీ, రెస్క్యూ విభాగం సేవలను ప్రజా ప్రతినిధులు, హాజరైన నిరుద్యోగ యువత కొనియాడారు.

సింగరేణి ప్రాంతాలు, పరిసర ప్రాంతాల్లో నిర్వహించే సామాజిక బాధ్యత కార్యక్రమాలకు పూర్తిస్థాయిలో సహకారం అందిస్తుందని సీఎండీ బలరామ్ తెలిపారు. ప్రత్యేకంగా ఉద్యోగ మేళాలకు సంస్థ సంపూర్ణ సహకారం అందించనుందని, స్థానిక యువతకు, రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి సింగరేణి తన వంతు సహకారం అందిస్తుందని పేర్కొన్నారు. త్వరలోనే కొత్తగూడెం, ఇల్లందు, మణుగూరు, ఆసిఫాబాద్ తదితర ప్రాంతాల్లో మెగా ఉద్యోగ మేళాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వెల్లడించారు.

సీఎం దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకొన్న పోలీసులు



ఓదెల లో సీఎం దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకుంటున్న పోలీసులు

ఓదెల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సింధూర్‌పై సీఎం అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ మండల కేంద్రంలో ఆదివారం బీజేపీ నాయకులు సీఎం దిష్టిబొమ్మను దహనానికి యత్నించారు. పొత్కపల్లి ఎస్‌ఐ రమేష్, సిబ్బంది దిష్టిబొమ్మను స్వాధీనం చేసుకొని నిరసనకారులను సంఘటన స్థలం నుంచి పంపించి వేశారు. బీజేపీ నాయకుడు కారంగుల శ్రీనివాస్ మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్‌పై సీఎం అనుచిత వ్యాఖ్యలు చేయడం సబబు కాదని ఖండించారు. తుఫాన్ వల్ల పంటలు నష్టపోయిన రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే ఎకరానికి రూ.35 వేల చొప్పున పరిహారం అందజేయా లని డిమాండ్ చేశారు. తడిసిన ధాన్యాన్ని, మొలకెత్తిన ధాన్యాన్ని తేమతో పని లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కారంగుల శ్రీనివాస్, తీర్థాల కుమారస్వామి, మేర్గు సారంగం, రామినేని రాజేంద్రప్రసాద్, పోలోజు శ్రీహరి, శాతాళ్ల కుమార్, తిరుపతి, కృష్ణ, శ్రీకాంత్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): అధికారం చేపట్టిన కాంగ్రెస్ రెండేళ్ల గడిచినా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, కేంద్రంలో అవినీతి మచ్చలేని బీజేపీ ప్రభుత్వాన్ని విమర్శించడం సిగ్గుచేటని బీజేపీ నాయ కులు మిట్టపల్లి ప్రవీణ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు చౌదరి మహేందర్ యాదవ్, మండల అధ్యక్షుడు కందుల శ్రీనివాస్ విమర్శించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. రాజీవ్ రహదారిపై ఆందోళన, ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా చేసి సీఎం, కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ముఖ్యమంత్రితోపాటు మంత్రులు తమ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలన్నారు. మండల ప్రభారీ కామని రాజేంద్రప్రసాద్, మాజీ మండల అధ్యక్షుడు కొమ్ము తిరుపతి, జిల్లా కౌన్సిల్ మెంబర్ వేగోళం శ్రీనివాస్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి కోట నాగేశ్వర్, ఉషన అన్వే ష్, గుంటి కుమార్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు వడ్లకొండ మహేష్, మెంగని రామకృష్ణ, రమేష్, పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

సుల్తానాబాద్, నవంబరు2(ఆంధ్రజ్యోతి): తేమశాతం నిబంధనలు లేకుండా ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలో మొత్తం 335 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారని, ప్రారంభోత్సవాల కోసం రైతుల నిరీక్షణ బాధాకరమని అన్నారు. తేమ 17 శాతం అంటూ కొర్రీలు పెట్టకుండా వెంటనే కాంటా వేసి తరలించాలన్నారు. ఆరుగాలం కష్టపడి పండించినా పంట ప్రకృతి బీభత్సానికి గురైందని, మిగిలిన మార్కెట్‌కు తెస్తే మ్యాచర్ పేరుతో ఆలస్యం చేస్తూ వేధించడం సరికాదని అన్నారు. మిగిలిన కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని కోరారు.

అయ్యప్ప ఆలయానికి రూ.50 వేల విరాళం



విరాళం అందజేస్తున్న మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్

కాల్వశ్రీరాంపూర్, నవంబరు2(ఆంధ్రజ్యోతి): పాండవులగుట్టపై నిర్మించిన అయ్యప్ప దేవాలయానికి మాజీ ఎంపీపీ గోపగాని సారయ్య గౌడ్ రూ.50 వేలు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజవేన సదయ్య రూ.50 వేల చొప్పున ఆదివారం అయ్యప్ప సేవా సంఘం అధ్యక్షుడు పెద్దిరెడ్డి వీరారెడ్డికి విరాళంగా అందజేశారు. మాజీ ఎంపీపీ సారయ్య గౌడ్ నగదు అందజేయడంతోపాటు నిత్యాన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

రైతులు అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం...



నర్సాపూర్‌లో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణరావు

ఎలిగేడు, నవంబరు2(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను తాకిడికి పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని, అధైర్యపడొద్దని తాము అండగా ఉంటామని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు. ఆదివారం నర్సాపూర్, ఎలిగేడు గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలతో నష్టపోయిన పంటలకు తగిన మద్దతు ధర కల్పించి ఆదుకుంటామన్నారు. వ్యవసాయ అధికారులతో పంట నష్టాలను అంచనా వేయాలని ఆదేశించినట్లు ఆయన పేర్కొన్నారు. ఎప్పటిమాదిరిగానే రైతులకు సమస్య రానీయకుండా చూస్తానన్నారు. ఎలాంటి కటింగ్‌లు లేకుండా కొనుగోళ్ల పూర్తి చేస్తామన్నారు. 17 శాతం లోపు తేమ వచ్చేలా చూడాలన్నారు. వడ్లను అమ్మిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా తనకు రైతులు నేరుగా సంప్రదించాలని తెలిపారు. పీఏసీఎస్ చైర్మన్ గోపు విజయ భాస్కర్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సామ రాజేశ్వర్ రెడ్డి, నాయకులు దుగ్యాల సంతోష్ రావు, అర్షనపల్లి వెంకటేశ్వర్ రావు, వామన్‌రావు, పల్లెర్ల వెంకటేష్, కొత్తిరెడ్డి అశోక్ రెడ్డి, మండిగ రాజనర్సు, నరహరి సుధాకర్ రెడ్డి, అమ్ముల శ్రీనివాస్, రఫీ, సుధాకర్ రెడ్డి, కొండ తిరుపతి గౌడ్, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

108లో ప్రసవం

రామగిరి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): బేగంపేట గ్రామానికి చెందిన గోవిందుల మౌనిక అనే మహిళకు 108 సిబ్బంది ఆదివారం పురుడు పోశారు. మౌనికకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 కి సమాచారం ఇచ్చారు. సిబ్బంది గ్రామానికి చేరుకోగా అప్పటికే నొప్పులు తీవ్రం కావడంతో 108 ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ నిమ్మతి శ్రీనివాస్ అప్రమత్తమై డెలివరీ చేయగా ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారు. టెక్నీషియన్ శ్రీనివాస్, పైలెట్ మామిడి స్వామి, మాతా శిశు ఆరోగ్యసిబ్బందిని గ్రామస్తులు అభినందించారు. అనంతరం చికిత్స నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బుంగను పూడ్చిన అధికారులు

ముత్తారం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పారుపల్లి శివారులోని పెద్ద చెరువు చిన్న తూము వద్ద ఏర్పడిన బుంగను అధికారులు పూడ్చివేశారు. ఆదివారం అధికారులు బుంగను పరిశీలించి గ్రామస్థుల సహకారంతో పూడ్చివేశారు. సమయానికి అధికారులు స్పందించడంతో పెద్ద ప్రమాదం తప్పిందని గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు. అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయాల్లో చిలుక ద్వాదశి పూజలు



శివాలయంలో దీపదానం చేస్తున్న భక్తులు

సుల్తానాబాద్, నవంబరు2(ఆంధ్రజ్యోతి): కార్తీక శుద్ధ చిలుక ద్వాదశి సందర్భంగా ఆదివారం ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయంలో భక్తులు సాలగ్రామ దానాలు, వస్త్రదానాలు, దక్షిణ తాంబులాలు దీపదానాలు చేశారు. స్వామివారికి వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ అన్నయ్య గౌడ్, మాజీ సర్పంచ్ పుష్పలత పండితులకు దానాలు సమర్పించారు. పూజారి పారువెల్ల రమేష్ శర్మ కార్తీక పురాణ ప్రవచనాలు చేశారు. ఆలయ అర్చకులు వల్లకొండ మఠం మహేష్, ఆలయ కమిటీ చైర్మన్ అల్లంకి సత్యనారాయణ, డైరెక్టర్లు పాల్గొన్నారు.


నిధులు మంజూరుపై హర్షం



స్వీట్లు తినిపించుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

సుల్తానాబాద్, నవంబరు2(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారానే సుల్తానాబాద్ పట్టణ సమగ్రాభివృద్ధి సాధ్యమని, ఎమ్మెల్యే విజయరమణరావు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాష్‌రావు, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్ అన్నారు. సుల్తానాబాద్ పట్టణ అభివృద్ధికి రూ.15 కోట్ల నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసిన నేపథ్యంలో ఆదివారం సంబరాలు జరుపుకున్నారు. బాణసంచా పేల్చి, స్వీట్లు పంచుకున్నారు. నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయంలో పట్టణాభివృద్ధిని విస్మరించారన్నారు. ఇప్పటికే సుల్తానాబాద్ పట్టణంలో రూ.10 కోట్ల నిధులను వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. పట్టణ అభివృద్ధికి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే విజయరమణరావు, సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వేగోళం అబ్బయ్యగౌడ్, నాయకులు పన్నాల రాములు, రాజయ్య, కృష్ణ, రాజలింగం, అమిరిశెట్టి తిరుపతి, నయీం, ప్రభాకర్, మెంగని శ్రీనివాస్, నన్ను, దేవేందర్, మల్లారెడ్డి, రఫీ, శంకర్, నాంపల్లి, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

ఆర్‌సీవోను సన్మానించిన బీసీ ఫెడరేషన్ సభ్యులు



రాజేశంను సన్మానిస్తున్న బీసీ ఆజాది ఫెడరేషన్ సభ్యులు

ధర్మారం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రీజనల్ కో-ఆర్డినేటర్ (ఆర్‌సీఓ)గా పదోన్నతి పొందిన జక్కని రాజేశంను బీసీ ఆజాది ఫెడరేషన్ సభ్యులు ఆదివారం సన్మానించారు. దొంగతుర్తి గ్రామానికి చెందిన జక్కని రాజేశం సుల్తానాబాద్ మండలం భూపతిపూర్ మహాత్మ జ్యోతిబాపూలే ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆర్‌సీవోగా పదోన్నతి పొందిన రాజేశం ఉమ్మడి మెదక్ జిల్లాలో రీజనల్ కో-ఆర్డినేటర్ విధులు నిర్వహించనున్నారు. తమ్మడవేని శ్రీనివాస్, శ్రావణ్ కుమార్, అలువాల రాజేశం, పాలకుర్తి నరేష్, బాపన్న, శ్రీనివాస్, శంకర్, పాల్గొన్నారు.

సదర్ సంబరం...

కరీంనగర్ కల్చరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్‌లో సదర్ సంబరాన్ని ఆదివారం ఉత్సాహంగా నిర్వహించారు. సదర్ ఉత్సవ కమిటీ జిల్లా చైర్మన్ సందెబోయిన రవియాదవ్ ఆధ్వర్యంలో గిద్దెపెరుమాళ్ల ఆలయం, బొమ్మకల్, గాంధీచౌక్ నుంచి ఆయా ప్రాంతాల యాదవులు పట్టు వస్త్రాలు, ముత్యాలు, పసుపు కుంకుమలు, పూల మాలలతో ముస్తాబు చేసిన దున్నలను ఊరేగించారు. కమాన్ నుంచి భారత్ థియేటర్ రోడ్‌లో ప్రదర్శన చేపట్టగా దున్నలను ఆసక్తిగా తిలకించారు.

జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సురేందర్



పెద్దపల్లి కల్చరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మార్వాడీ గోబ్యాక్ జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పట్టణానికి చెందిన బొంకూరి సురేందర్‌ను నియమించినట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు పిడమర్తి రవి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయనకు నియామక పత్రం అందజేశారు. అనంతరం సురేందర్ మాట్లాడుతూ గుజరాత్, రాజస్థాన్ నుంచి వచ్చిన మర్వాడీలు స్థానికులకు వ్యాపార, ఉపాధి అవకాశాలను దెబ్బతిస్తున్నారని ఆరోపించారు. వారి వల్ల రాష్ట్రంలో అనేక రంగాల్లో స్థానికులు ఉపాధి కోల్పోతున్నారన్నారు. వారి ఆగడాలను అడ్డుకుని స్థానికులకు అన్ని రకాలుగా న్యాయం చేస్తామని, తనపై నమ్మకంతో అవకాశం కల్పించిన రవికి సురేందర్ కృతజ్ఞతలు తెలిపారు.

పవర్ డిప్లమా ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వెంకట నారాయణ



పెద్దపల్లి కల్చరల్, నవంబర్ 2 (ఆంధ్రజ్యోతి): పవర్ డిప్లమా ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నాలుగోసారి పెద్దపల్లి జిల్లాకు చెందిన వంగల వెంకట్ నారాయణ (వెంకట్ ఏఈ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం యాదాద్రిలోని పవర్ టిప్లమా ఇంజనీర్స్ అసోసియేషన్ గెస్ట్‌హౌస్‌లో ఎన్నికలు జరిగాయి. ఈ కార్యక్రమానికి వివిధ జిల్లాలకు చెందిన ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ హాజరై కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నాలుగోసారి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడానికి సహకరించిన వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సింగరేణి ఉద్యోగులు బెంబేలు

●150/200 మస్టర్లు లేకుంటే ఇంటికే ● సర్క్యులర్ జారీ చేసిన యాజమాన్యం

శ్రీరాంపూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇటీవల యాజమాన్యం జారీ చేసిన సర్క్యులర్‌తో సింగరేణి ఉద్యోగులు బెంబేలెత్తుతున్నారు. ఓ వైపు కొన్ని నెలలుగా మెడికల్ బోర్డు ఆగిపోయింది. దీనివల్ల వారసత్వ ఉద్యోగాలు రావడం లేదు. మరోవైపు ఏడాదికి 150/200 మస్టర్లు చేయకుంటే డిస్మిస్ చేస్తామంటూ సింగరేణి సర్క్యులర్ జారీ చేసింది. సింగరేణిలో క్లర్కులు, ఇంజనీర్ల ఉద్యోగాల కోసం నియామక ప్రక్రియ జరుగుతున్నా కార్మికులను తీసుకో వడం లేదు. అయితే ఇప్పటికే పనిచేస్తున్న వారి వారసులకు అవకాశం కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా అనారోగ్య కారణంతో మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్ అయితే సంబంధిత ఉద్యోగి వారసులకు ఉద్యోగాలు వస్తాయి. ఈ ప్రక్రియలో ముఖ్యమైన మెడికల్ బోర్డు ఈ ఏడాది మార్చి నుంచి ఏర్పాటు చేయడం లేదు. ఇప్పటికే ఎంపికై ఉన్న 373 మందికి వారసులకు నియామకాలు ఇవ్వలేదు.

అండర్‌గ్రౌండ్ గనులు మూత..

సింగరేణిలో నానాటికి అండర్‌గ్రౌండ్ గనులు మూతపడుతున్నాయి. నూతన గనులు రావడం లేదు. కొత్తగా ఉపరితల (ఓసీపీ) గనులే ఉంటున్నాయి. అందులోనూ ఓబీ, బొగ్గు ఉత్పత్తి ప్రైవేటు కాంట్రాక్టర్లే చేపడుతున్నారు. అందులో సింగరేణికి చెందిన పర్మనెంటు ఉద్యోగులు పదుల సంఖ్యలోనే ఉంటారు. ఈ క్రమంలో మూతపడుతున్న గనుల్లోని సిబ్బందిని ఇప్పటికైతే సర్దుబాటు చేస్తున్నారు. కానీ వారంతా అదనంగా ఉన్నారని కంపెనీ భావిస్తోంది. ఈ తరుణంలో వారసత్వంగా ఉద్యోగులను తీసుకొని ఏం చేయాలని యాజమాన్యం ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. వారసులకు నియామక ఉత్తర్వులు ఇవ్వడం లేదని కార్మికులు ఆరోపిస్తున్నారు.

ఇంత మంది ఉన్నా..

సింగరేణిలో తగినంత సిబ్బంది, వారానికి ఆరు పనిదినాలు ఉన్నప్పటికీ ఉద్యోగుల గైర్హాజరుతో అనుకున్న మేర లక్ష్యాలను చేరడానికి అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. వారసత్వ నియామకాల ద్వారా వచ్చిన ఉద్యోగులు విధులకు సక్రమంగా హాజరు కావడం లేదు. ఫలితంగా బొగ్గు ఉత్పత్తిని వెలికితీయడంలో సంస్థ లక్ష్యాలను చేరుకోవడం లేదు. యాజమాన్యం అనుకున్న బొగ్గు ఉత్పత్తిని తీయాలని ప్రయత్నం చేస్తోంది. మరోవైపు మానవతా దృక్పథంతో గైర్హాజరు కార్మికులకు స్థానిక అధికారుల ద్వారా గనులు, విభాగాలలో కౌన్సెలింగ్ నిర్వహిస్తూ విధులకు హాజరు కావాలని సూచిస్తోంది. వ్యక్తిగతంగా, ఆర్థికంగా కుటుంబానికి కలిగే నష్టాన్ని వివరిస్తున్నారు. కానీ అనుకున్న మేరకు ఫలితం రావడం లేదు.

గతంలో ఏడాదికి వంద..

గతంలో ఏడాదిలో కనీసం వంద మస్టర్లు ఉంటే విధుల్లో కొనసాగించేవారు. అంటే సుమారుగా వారానికి 2, నెలకు 8 మస్టర్ల లెక్కన పనిచేయాలి. కానీ బయట ఉన్న పని పరిస్థితులకు, సింగరేణిలో ఉండే విధానానికి అలవాటు కాకపోవడంతో చాలా మంది కార్మికులు వాటిని కూడా చేరడం లేదు. ఇటీవల సింగరేణి విడుదల చేసిన సర్క్యు లర్‌లో ఏడాదిలో కనీసం 150/200 (అండర్‌గ్రౌండ్/సర్ఫేస్) మస్టర్లు ఉండాలని నిర్దేశించారు. ఈ ప్రకారం ఉద్యోగులు వారానికి మూడు రోజులు, నెలకు 12 రోజులు పనిచేయాల్సి ఉంటుంది.

నిబంధనలు ఇలా..

ఏడాదిలో 150/200 మస్టర్లు పనిచేయని ఉద్యోగులపై తీసుకునే చర్యల గురించి యాజమాన్యం సర్క్యులర్‌లో స్పష్టం చేసింది. 150/200 మస్టర్ల కంటే తక్కువగా ఉంటే మొదటిసారి తప్పు చేసిన ఉద్యోగికి యాజమాన్యం హెచ్చరికతో కూడిన లేఖ ఇచ్చి, 10 రోజులకు మించకుండా వేతనం లేని సస్పెన్షన్‌ను జారీచేస్తారు. రెండోసారి తప్పు చేస్తే ఒక ఇంక్రిమెంట్‌ను నిలిపివేస్తారు. 100/150 మస్టర్ల కంటే తక్కువగా ఉంటే మొదటిసారి తప్పు కింద రెండు ఇంక్రిమెంట్లు నిలుపుదల చేస్తారు. రెండోసారి తప్పు చేస్తే ప్రస్తుత గ్రేడ్ నుంచి కింది గ్రేడ్‌కు డిమోట్ చేస్తారు. మూడోసారి అలాగే ఉంటే ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగిస్తారు. ఒక ఏడాదిలో పూర్తిగా గైర్హాజరైతే (జీరో మస్టర్స్) కిందిస్థాయి గ్రేడ్‌కు మారుస్తారు. వరుసగా రెండేళ్లు, అంతకన్నా ఎక్కు కాలం విధులకు రాకపోతే ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగిస్తారు. ఈ నిబంధనలను పరిశీలిస్తే తరచూ గైర్హాజరయ్యే కార్మికుల ఉద్యోగాలకు ఎసరు వచ్చే అవకాశం ఉంది.

వీరబ్రహ్మేంద్రస్వామికి పూజలు



పూజలు చేస్తున్న విశ్వబ్రాహ్మణులు

పెద్దపల్లి కల్చరల్, నవంబరు2(ఆంధ్రజ్యోతి): విశ్వబ్రాహ్మణ కుల ఆరాధ్య దైవమైన పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి జన్మదిన వేడుకలను జిల్లా కేంద్రంలోని వీరబ్రహ్మేంద్ర బాలస్వామి ఆలయంలో విశ్వబ్రాహ్మణులు నిర్వహించారు. స్వామివారికి అభిషేకం, పూజా కార్యక్రమాలను పండితుడు శ్రీనివాస్ చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వేడుకల్లో దేవాలయ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు కట్ట రాజనందం, ప్రధాన కార్యదర్శి చింతల సత్యనారాయణ, దేవాలయ కమిటీ ఉపాధ్యక్షుడు గొల్లపల్లి రమేష్, కార్పెంటర్ల పట్టణ అధ్యక్షుడు, దేవాలయ కమిటీ ఉపాధ్యక్షుడు మియపురం రమేష్, రాష్ట్ర కార్యదర్శి బెజ్జంకి మోహన్, వెంకటేశ్వర్లు, కట్ట రమేష్, కోటయ్య, దేవరకొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

కళ్యాణ్‌నగర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజలకిచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని, రెండు సంవత్సరాలైనా నెరవేర్చలేదని టీఆర్ఎస్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోడేటి శంకర్‌గౌడ్ ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో మంత్రుల మధ్య వర్గపోరు పెరిగిపోయి ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. బీజేపీకి ఇద్దరు కేంద్ర మంత్రులు, 8మంది ఎమ్మెల్యేలు, ఎంపీలు ఉన్నా రాష్ట్రానికి నిధులు తీసుకురావడంలో విఫలమైనట్లు తెలిపారు. తెలంగాణ రక్షణ సమితి పార్టీని ప్రజలు ఆదరిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా, జిల్లా వ్యాప్తంగా మండల స్థాయిలో పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నట్టు చెప్పారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఓదెల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రూపునారాయణపేటలో విద్యార్థి గుర్రం అక్షిత పాము కాటుతో మరణించగా ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పరామర్శించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం కింద కొంత నగదును అందజేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఐరెడ్డి వెంకట రెడ్డి, పర్శరాం, ఆగయ్య, గణపతి తదితరులు ఉన్నారు.